సాక్షి
మెదక్
శుక్రవారం ၊ 29 ၊ మార్చి ၊ 2024



దొంగల ముఠా అరెస్టు

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్పీ బాలస్వామి తెలిపారు.


వివరాలు 10లో ▸



అన్నదాత అరిగోస..!

ఎండలు మండుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో సాగునీరందక పంటలు దెబ్బతింటున్నాయి.

వివరాలు 10లో ▸



న్యూస్‌రీల్

ప్రజావాణి రద్దు

మెదక్ కలెక్టరేట్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణిని తాత్కాలికంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు, సిబ్బంది ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నందున ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు రద్దు చేసినట్లు చెప్పారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

చెక్‌పోస్టు తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

రామాయంపేట/చేగుంట(తూప్రాన్): మండలంలోని బోనాల్‌లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఎస్పీ బాలస్వామి గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా రామాయంపేట రహదారిలో తిరుగుతున్న వాహనాలకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. వాహన తనిఖీలను పకడ్బందీగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఆయనతో పాటు రామాయంపేట సీఐ వెంకటేశ్, చేగుంట ఎస్‌ఐ బాలరాజు, సిబ్బంది ఉన్నా రు. అలాగే రామాయంపేట మండలంలోని దామర చెరువు శివారులో జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు.

అర్హులందరికీ 'గృహజ్యోతి'



మాట్లాడుతున్న డీఈ కృష్ణారావు

చిలప్‌చెడ్(నర్సాపూర్): గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని మెదక్ డివిజన్ విద్యుత్‌శాఖ డీఈ కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం మండలంలోని చిటుకుల్‌లో విద్యుత్ సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి గృహజ్యోతి పథకం వర్తిస్తుందన్నారు. జీరో బిల్లు రానివారు ప్రజాపాలన దరఖాస్తును ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. గ్రామాలు, పొలాల వద్ద విద్యుత్ సమస్యలు ఎదురైతే దగ్గరలో ఉన్న విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, మాజీ సర్పంచ్ పరశురాం రెడ్డి, ఏఈ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుభాష్‌చంద్రగౌడ్



మెదక్‌జోన్: మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సుభాష్‌చంద్రగౌడ్ ఎన్నికయ్యారు. అధ్యక్ష పదవికి న్యాయవాదులు బాలయ్య, సుభాష్‌చంద్రగౌడ్ పోటీపడగా గురువారం ప్రత్యక్ష ఎన్నిక నిర్వహించారు. మొత్తం 85 మంది ఓటర్లు ఉండగా వాటిలో 81 ఓట్లు పోలయ్యాయి. వాటిలో 40 ఓట్లు బాలయ్యకు రాగా 41 ఓట్లు సుభాష్ చంద్రగౌడ్‌కు పోలయ్యాయి. కేవలం ఒక్క ఓటు మెజార్టీతో గెలుపొంది బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీపతిరావు విజయం సాధించారు.

మోదీ హ్యాట్రిక్ పీఎం పక్కా



మాట్లాడుతున్న మురళీయాదవ్

నర్సాపూర్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వస్తుందని, నరేంద్రమోదీ మూడోసారి పీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలో దశాబ్దాల పాటు కాంగ్రెస్ అధికారంలో ఉండి చేసిందేమీ లేదన్నారు. ప్రజలకు ఆ పార్టీపై నమ్మకం లేకుండా పోయిందని అన్నారు. మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఓబీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్ద రమేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు చిన్న రమేష్‌గౌడ్, పార్టీ కార్యదర్శులు సురేష్, రాజేదర్, నాయకులు పాల్గొన్నారు.

టెట్ లేకుండానే పదోన్నతులివ్వాలి

మెదక్‌జోన్: ఎన్నో ఏళ్లుగా ఇన్విజిలేటర్, స్పాట్ వాల్యుయేషన్ డ్యూటీలు చేస్తున్న ప్రభుత్వ, పంచాయతీరాజ్ పాఠశాలల ఉపాధ్యాయులకు టెట్ లేకుండానే పదోన్నతులు ఇవ్వాలని పీఆర్టీయూ జనరల్ సెక్రటరీ సుంకరి కృష్ణ గురువారం ఒక ప్రకటనలో కోరారు. నిబంధనల పేరిట కాలయాపన చేయడం తగదన్నారు. ఎలాంటి అర్హత పరీక్ష లేకుండానే కాంట్రాక్టు లెక్చరర్లను ఇంటర్, డిగ్రీ బోధకులుగా నియమిస్తున్న ప్రభుత్వం ఉపాధ్యాయులు మాత్రం టెట్ ఉత్తీర్ణత సాధిస్తేనే పదోన్నతులు ఇస్తామనడం సరికాదని అన్నారు.

ఓటీఎస్ ఆఫర్..



మెదక్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్

మరో రెండు రోజులే..

- ఈనెల 31 వరకు అన్ని బ్యాంకుల్లో అవకాశం
- బకాయిలో 60 శాతం చెల్లిస్తే సరి

మెదక్‌జోన్: బ్యాంకుల ద్వారా పంటల సాగు కోసం రుణాలు తీసుకొని పలు కారణాలతో ఏళ్ల తరబడి చెల్లించని రైతులకు బ్యాంకులు సువర్ణ అవకాశం కల్పించాయి. బకాయి మొత్తంలో 60 శాతం మేర వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పేరుతో రుణ విముక్తికి అవకాశం కల్పించింది. పాత అప్పు చెల్లించిన వారంలోనే మళ్లీ కొత్త రుణాలు అందజేయనుంది.

ఎవరికి ప్రయోజనమంటే..

జిల్లాలోని మెదక్, నర్సాపూర్ రెండు నియోజకవర్గాల పరిధిలో 18 రకాల బ్యాంకులు ఉండగా మొత్తం 92 బ్రాంచీలున్నాయి. వీటి ద్వారా రైతులకు ఇతర వాణిజ్య, విద్య, ఉద్యోగులకు పలు సేవలందిస్తున్నాయి. కాగా వీటి పరిధిలోని 2018లో కొంత మంది, అంతకన్నా ముందు 1,50,514 మంది రైతులు మొత్తంగా రూ.921 కోట్ల అప్పులు తీసుకున్నారు. వీటిలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.25లు, రూ.50 వేల అప్పు తీసుకున్న వారిలో 73,026 మందికి రూ. 366 కోట్లను మాఫీ చేసింది. ఇంకా 77,488 మంది రైతులు వివిధ బ్యాంకులకు రూ. 546 కోట్ల చెల్లించాల్సి ఉంది.

వెంటనే కొత్తరుణం

గతంలో తీసుకున్న రుణాలు చెల్లించిన మొండి బకాయిదారులకు గతంలో బ్యాంకులు 5–6 నెలల వరకు తిరిగి ఇచ్చేవి కావు. ప్రస్తుతం ఓటీఎస్ ద్వారా రుణాలు చెల్లిస్తే మళ్లీ వారం రోజుల్లో కొత్త రుణాలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. రెగ్యులర్ రుణగ్రస్తుడిగా పరిగణిస్తారు.

జిల్లావ్యాప్తంగా 31,274 మంది

ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 31,274 మంది రైతులను వివిధ బ్యాంకులు మొండి బకాయిదారులుగా గుర్తించి నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్ (ఎన్‌పీఏ) జాబితాలో చేర్చాయి. అయితే ప్రస్తుతం ఇలాంటి వారికి ఓటీఎస్ ద్వారా చెల్లించేందుకు బ్యాంకులు చక్కటి అవకాశం ఇచ్చాయి. పదేళ్ల పాటు బకాయి పడిన అన్నదాతలు సైతం చెల్లించాల్సిన వ్యవసాయ రుణాల్లో మొత్తంగా 60 శాతం చెల్లిస్తే చాలు. ఉదాహరణకు ఓ రైతు రూ. 50 వేల రుణం తీసుకుని ఆరేళ్లు గడుస్తుంది అనుకుంటే ఇదికాస్తా డబుల్ అవుతుంది. కానీ వారు బ్యాంకు నిబంధనలు పాటించి వన్‌టైం సెటిల్‌మెంట్ ద్వారా రూ. 60 వేలు చెల్లిస్తే సరిపోతుంది. ఈ అవకాశం జిల్లావ్యాప్తంగా గల అన్ని బ్యాంకుల్లో ఈనెల 31 వరకు ఉంది.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



వన్‌టైం సెటిల్ మెంట్ అవకాశం ఈనెల 31 వరకు మాత్రమే ఉంది. దీనిని రైతులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. ఈ విషయంపై బ్యాంకు సిబ్బందితో వారికి అవగాహన కల్పిస్తున్నాం. కొంతమంది రైతులు ముందుకొచ్చి చెల్లిస్తున్నారు.

– నర్సింహమూర్తి, మెదక్ లీడ్‌బ్యాంక్ మేనేజర్

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

కలెక్టర్ రాహుల్‌రాజ్



గూగుల్ మీట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: వేసవిలో గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికా రులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి ప్రారంభమైన దృష్ట్యా నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న గ్రామాలను ముందస్తుగా గుర్తించాలన్నారు. మిషన్ భగీరథ నీరు క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. గతేడాది నీటి ఎద్దడిని ఎదుర్కొన్న గ్రామాల్లో సమస్య మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ ఏఈలు క్షేత్రస్థాయిలో తిరిగి తాగునీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సరిచేయాలని చెప్పారు. కార్యాచరణపై వారంలోగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. తాగు నీటి పైపులైన్ లేని ప్రదేశాల్లో ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా అయ్యేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ను మిల్లర్లు త్వరగా పూర్తి చేయాలి

కొల్చారం(నర్సాపూర్): రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్‌ను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని సత్యసాయి రైస్‌మిల్, శ్రీధర్ ఇండస్ట్రీస్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పేరుకుపోయిన ధాన్యంపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న మిల్లర్లు ఏప్రిల్ 30 లోగా సరఫరా పూర్తి చేయాలన్నారు. అప్పటికి పెండింగ్‌లో ఉంటే కఠిన చర్యలకు ఆదేశాలు జారీ చేస్తామని హెచ్చరించారు.

మెదక్‌లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

- పార్టీ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు
- సీఎంను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేత



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధు

పటాన్‌చెరు : కాంగ్రెస్ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, అందరి సహకారంతో మెదక్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని పార్టీ మెదక్ లోక్‌సభ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిన సందర్భంగా హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాడు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ లాంటి మహానేత ప్రాతినిధ్యం వహిస్తే నేడు ఆ స్థానంలో పోటీ చేసే అవకాశం తనకు దక్కడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరాగాంధీ హయాంలోనే ఈ లోక్‌సభ నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిందని చెప్పారు. ఈ విషయాన్నే ప్రజల్లోకి తీసుకొని వెళ్లి పార్టీ గెలుపొందేలా కృషి చేస్తానని తెలిపారు. మంత్రి దామోదర రాజనర్సింహ, జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు ఆశీస్సులతో ఎంపీ స్థానం పరిధిలో ఉన్న అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, పార్టీ ముఖ్య నాయకులను కలుపుకొని ముందుకు వెళ్తానన్నారు.

బోరుమన్న 'బాచారం'

- పెళ్లి ట్రాక్టర్ బోల్తా ఘటనలో మృతిచెందిన మహిళలకు అంత్యక్రియలు
- మరోవైపు మనస్తాపంతో వరుడి తాత ఆత్మహత్య
- కన్నీటిసంద్రమైన గ్రామం



ఆగమ్మ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

పాపన్నపేట(మెదక్): ముగ్గురు మహిళల దుర్మరణంతో శోకసంద్రమైన గ్రామంలో మరో విషాదఘటన చోటుచేసుకుంది. పెళ్లి ఆగిపోయిందని వరుడు తాత ఆత్మహత్యకు పాల్పడటంతో ఊరంతా కన్నీటిపర్యంతమైంది. పెళ్లి ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ముగ్గురు మహిళలు దుర్మరణం చెందిన విషయం విదితమే. అయితే పెళ్లి వేడుకలకు అందరిని పిలిచి, వారి చావుకు కారణమయ్యానన్న మనస్తాపంతో పెళ్లి కుమారుడు సొంగ రాము తాత పెంటయ్య (64) గురువారం తెల్లవారుజామున ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాచారం అంతా దు ఖఃసాగరమైంది. బంధువర్గాల రోదనలు మిన్నంటాయి.

విడివిడిగా మెట్టింటికి.. కలిసి కాటికి

రావుగారి బూదమ్మను పొల్వంచ నుంచి బాచారం గ్రామానికి చెందిన కిష్టయ్యకు ఇచ్చి వివాహం చేశారు. రావుగారి ఆగమ్మను గాజులగూడెం నుంచి ఇదే గ్రామానికి చెందిన మల్లయ్యకు ఇచ్చి వివాహం చేశారు. వీరిద్దరు ఒకే ఊరి కోడళ్లు అయినా కలిసి మెలిసి ఉండేవారు. బుధవారం వీరిద్దరు కలిసి పెళ్లి కూతురును తీసుకొచ్చేందుకు అందోల్ వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించారు. అయితే విడివిడిగా మెట్టింటికి వచ్చిన తోటి కోడళ్లిద్దరు కలిసి కాటికి వెళ్లిన తీరు అందరినీ కలిచివేసింది. అలాగే వరసకు మామా కోడళ్లు అయిన పెంటయ్య, జెట్టిగారి సంగమ్మ మృతదేహాలను ఒకదాని వెంట ఒకటిగా శ్మశానానికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

ప్రముఖుల పరామర్శ

మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ లావణ్యారెడ్డి, పాపన్నపేట వైస్ ఎంపీపీ విష్ణువర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఫోన్‌లో పరామర్శించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విమర్శిస్తే దాడులు చేస్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న పద్మ

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ

మెదక్‌మున్సిపాలిటీ: అధికార కాంగ్రెస్ ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన చేయకుండా బీఆర్‌ఎస్ కార్యకర్తల మీద దాడులు చేయిస్తుందని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ విమర్శించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. కౌన్సిలర్ ఆంజనేయులు ఇంటిపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పా లనలో ఇలాంటి దాడులకు తావేలేదన్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఒకే రోజు మూడు కండువాలు మార్చారన్నారు. పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరానికి రూ. 25 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళలు తాగు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. మెదక్ ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఇళ్లు, రోడ్ల నిర్మాణం ,ఆస్పత్రి కట్టిస్తానని ఇచ్చిన మాట నెరవేర్చాలన్నారు. ఎన్నికల కోడ్ అనంతరం అక్రమంగా కేసు పెట్టిన వారిని వదలబోమని హెచ్చరించారు. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎస్పీ, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ ఉపాధ్యక్షురాలు లావణ్యరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కౌన్సిలర్లు మామిండ్ల ఆంజనేయులు, కిశోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ మమత

వర్మీకంపోస్టు, నర్సరీల పెంపకంపై శిక్షణ

ములుగు(గజ్వేల్): స్థానిక అటవీ కళాశాల, పరిశోధన కేంద్రంలో వర్మీకంపోస్టు, నర్సరీల పెంపకంపై ఆరు నెలల పాటుగా నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణార్థులకు కళాశాల ప్రొఫెసర్ ఎం.మమత పలు సూచనలు సలహాలు ఇచ్చారు. నర్సరీలు, వర్మీకంపోస్టుల నిర్వహణలపై అవగాహన కల్పించారు. వివిధ ఉదాహరణలు వివరిస్తూ వృత్తి నైపుణ్యా లను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ జె.ఆశ, డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు,జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నీళ్లివ్వండి



నంగునూరులో పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

నంగునూరు(సిద్దిపేట): పార్టీ గేట్లు ఎత్తుతామని ఒకరు, కాళేశ్వరం గేట్లు ఎత్తాలని ఒకరు సవాళ్లు విసరకుండా కాల్వల ద్వారా నీరందించి పంటలను కాపాడాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. గురువారం నంగునూరులో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ నంగునూరు మండలంలో పంటలు ఎండుతున్నాయని రైతులు మొర పెట్టుకుంటున్నారన్నారు. కాల్వల ద్వారా నీళ్లివ్వాలని డీఈకి ఫోన్ చేస్తే వాగుపై లిఫ్ట్ పూర్తి కాలేదని చెప్పారని అన్నారు. పదేళ్ల పాలనలో ఎందుకు పూర్తి చేయలేదో మాజీ మంత్రి హరీశ్ రావు చెప్పాలన్నారు. అలాగే లక్షల కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా నీళ్లియ్యకున్నా పట్టించుకోని హరీశ్‌రావు హైదరాబాద్‌లో పంచాయతీలు చెప్పుకుంటూ పబ్బం గడుపుతున్నారని, చిత్తశుద్ధి ఉంటే నంగునూరుకు వచ్చి సాగు నీరు ఇప్పించాలని సవాల్ విసిరారు. తక్షణం సాగు నీరు అందించి పంటలను కాపాడాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, శంకర్, తిరుపతిరావు, యాదమల్లు, రజినీకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సురేందర్‌రెడ్డి, నాంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పాత్రపై

ఆరా

- గొర్రెల పంపిణీపై లోతైన విచారణ



సాక్షి, సిద్దిపేట: జిల్లాలో గొర్రెల పంపిణీపై అవినితి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో నలుగురు అధికారులను అరెస్ట్ చేశారు. అరెస్టయిన అధికారుల్లో జిల్లాలో పనిచేసి బదిలీపై వెళ్లిన అధికారి ఉండటంతో జిల్లాపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించారు. గొర్రెల పంపిణీ సక్రమంగా జరగాలన్న ఉద్దేశ్యంతో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు గొర్రెల పొక్యూర్‌మెంట్ కోసం ప్రత్యేక అధికారిగా నియమించారు. జిల్లాలో పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) రవికుమార్ పని చేసిన సమయంలో రంగారెడ్డి జిల్లాకు గొర్రెల పొక్యూర్‌మెంట్ అధికారిగా 2023లో వెళ్లారు. అక్కడ అవినీతికి పాల్పడటంతో గత నెలలో ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. సిద్దిపేట జిల్లాలో ఏడీగా విధులు నిర్వర్తిస్తూనే పొక్యూర్‌మెంట్ బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత కామారెడ్డి వెటర్నరీ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా రవికుమార్ బదిలీ అయ్యారు. ఏసీబీ అధికారులు అరెస్ట్ చేయడంతో పశుసంవర్ధ శాఖ సస్పెండ్ చేసింది.

అవినీతి జరిగిందా? లేదా?

సదరు అధికారి జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్నప్పుడే రంగారెడ్డి జిల్లాలో గొర్రెల పంపిణీలో అవినితికి పాల్పడ్డారు. దీంతో జిల్లాలో అవినీతి జరిగిందా? లేదా అన్న కోణంలో ఏసీబీ అధికారులు ఆరా తీస్తున్నారు. గొర్రెలను ఎవరి దగ్గర కొనుగోలు చేశారు? ఎవరికి అందించారు? వారికి నగదు చెల్లింపుల బ్యాంక్ అకౌంట్ వివరాలను ఇవ్వాలని పశుసంవర్ధక శాఖను కోరారు. జిల్లా నుంచి గొర్రెలకు పంపిణీకి సంబంధించిన సమాచారం పంపించాలని శాఖ డైరెక్టర్ ఆదేశించారు. జిల్లాలో జరిగిన గొర్రెల పంపిణీకి సంబంధించిన డేటాను మొత్తం డైరెక్టర్ నుంచి వచ్చిన ఫార్మెట్‌లో తయారు చేస్తున్నారు. ఈ వివరాలు పంపిన తర్వాత విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

మినరల్ దోపిడీ!



- వాటర్ ప్లాంట్ల నిర్వాహకుల ఇష్టారాజ్యం
- నీటి శుద్ధిలో నిబంధనలు గాలికి
- చోద్యం చూస్తున్న అధికారులు

మెదక్ కలెక్టరేట్: నీటిని వ్యాపార వస్తువుగా మార్చి కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. మినరల్ వాటర్ పేరుతో ఏమాత్రం శుద్ధి చేయని నీటిని క్యాన్లలో నింపి ప్రజలకు అంటగడుతున్నారు. ఇవి ఫిల్టర్ చేసినవని భావించి ప్రజలు సైతం కొంటున్నారు. ఆ నీరు తాగితే పిల్లలు, పెద్దలకు మోకాళ్ల నొప్పులు, ఎముకల సంబంధిత వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

విచ్చలవిడిగా ప్లాంట్ల ఏర్పాటు

ఒకప్పుడు ప్రజలు బావులు, కుళాయి నీరు తాగేవారు. మారుతున్న కాలంలో వస్తున్న మార్పుల్లో భాగంగా తాగునీరు మినరల్‌గా మారింది. ప్రస్తుతం అంతా ఆ నీటినే తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీనిని ఆసరా చేసుకున్న వ్యాపారులు జిల్లావ్యాప్తంగా విచ్చలవిడిగా ప్లాంట్లు ఏర్పాటు చేసి ఇంటింటా నీటిని సరఫరా చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

జిల్లావ్యాప్తంగా 1,000పైగా..

జిల్లావ్యాప్తంగా సుమారు వెయ్యికి పైగా వాటర్ ప్లాంట్లు, రెండు బాటిల్స్ తయారు చేసే ప్లాంట్లు ఉన్నాయి. అందులో కొందరు వ్యాపారులు ఇళ్లలో ఏర్పాటు చేసుకొని గుట్టుగా వ్యాపారం చేస్తున్నారు. అయితే ప్లాంట్లలోని నీటిని నిర్వాహకులు నెలలో రెండుసార్లు జిల్లా నీటి పరిశోధనా సంస్థకు పరీక్షల నిమిత్తం పంపించాలి. అంతేకాకుండా మైక్రో బయాలజిస్ట్‌తో ఎప్పటికప్పుడు నీటి స్వచ్ఛతను పరీక్షించాలి. కానీ ఏ ఒక్క వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు ఈ నిబంధనలు పాటించడం లేదు. వినియోగించే పరికరాలు సైతం స్టీల్‌వి వాడడం లేదు. తక్కువ ఖర్చులో లభించే ప్లాస్టిక్ పైపులు వినియోగిస్తున్నారు. నీటిని శుద్ధి చేసే సమయంలో క్రిములను సంహరించేందుకు వివిధ రకాల రసాయనిక మందులు వినియోగిస్తున్నారు.

అనుమతుల్లేవ్..

జిల్లాలోని వాటర్ ప్లాంట్ల నిర్వహణపై జిల్లా భూగర్భ జలశాఖ అధికారి వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. 90 శాతం వాటర్ ప్లాంట్లకు ఎలాంటి అనుమతులు లేవన్నారు. గతంలో అప్పటి కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు నోటీసులు జారీ చేశామన్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధుల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

31.015 లీటర్ల మద్యం పట్టివేత

బెల్ట్‌ దుకాణాలపై టాస్క్‌ఫోర్స్‌ దాడులు

గజ్వేల్‌రూరల్‌: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌ దుకాణాలపై టాస్క్‌ఫోర్స్‌, పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని శ్రీగిరిపల్లిలో గురువారం జరిగింది. గజ్వేల్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోడూరి పద్మ, కోడూరి రమేశ్‌ తమ ఇళ్లలో బెల్ట్‌ దుకాణాల ద్వారా మద్యం విక్రయిస్తున్నారు. అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్‌, పోలీసులు అధికారులు దాడిచేసి 31.015 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు మాట్లాడుతూ ఇళ్లు, హోటళ్లు, కిరాణా దుకాణాల్లో అనుమతులు లేకుండా బెల్ట్‌ దుకాణాలు నడిపినా, బహిరంగ ప్రదేశాలు, ఇళ్లలో పేకాట ఆడినట్లు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాలేజీకి వెళ్లి విద్యార్థి అదృశ్యం


అజిత్‌

కంది(సంగారెడ్డి): విద్యార్థి అదృశ్యమైన ఘటన రూరల్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని కందిలో చోటు చేసుకుంది. రూరల్‌ ఎస్‌ఐ వినయ్‌ కుమార్‌ కథనం ప్రకారం.. కందికి చెందిన నల్ల గాల్వ అజిత్‌(21) పటాన్‌ చెరు మండలం రుద్రారంలో గల గీతం యూనివర్సిటీలో సైబర్‌ సెక్యూరిటీలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. గత 25న కాలేజీకి వెళ్లిన అజిత్‌ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా అజిత్‌ కోసం వెతికినా జాడ తెలియరాలేదు. ఆచూకీ తెలిసినవారు 87126 56746 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


రమేశ్‌చారి(ఫైల్‌)

హవేళిఘణాపూర్‌(మెదక్‌): చేసిన అప్పులు తీర్చేదారి లేక ఓ కార్పెంటర్‌ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని మంభోజిపల్లిలో గురువారం వెలుగులోకి వచ్చింది. హవేళిఘణాపూర్‌ మండలం తొగిట గ్రామానికి చెందిన వడ్ల రమేశ్‌చారి(29) మంభోజిపల్లిలో కార్పెంటర్‌ షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఇటీవల అప్పులు చేసి మిషినరీ కొనుగోలు చేశాడు. అప్పులు తీర్చేందుకు ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం షాపునకు వెళ్లాడు. గురువారం ఉదయం అతడి షాపు షట్టర్‌ సగం తెరిచి ఉండడాన్ని స్థానికులు గమనించి చూడగా రమేశ్‌చారి ఉరివేసుకొని ఉండడం చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

మద్యానికి బానిసై..

పటాన్‌చెరు టౌన్‌: భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వడక్‌పల్లి గ్రామానికి చెందిన బుచ్చమ్మ కుమారుడు మల్లేశ్‌(42)కు ఆరేళ్ల క్రితం హత్నూర మండలం చింతలచెరువుకు చెందిన మాధవితో వివాహం జరిగింది. రెండేళ్ల క్రితం గొడవ జరగడంతో మాధవి తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం మల్లేశ్‌ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి బుచ్చమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

మిరుదొడ్డి(దుబ్బాక): సీతారామచంద్ర స్వామి వాగుగడ్డ జాతర కమిటీ ఆధ్వర్యంలో కూడవెల్లి వాగు ఒడ్డున నూతన ఆలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మిరుదొడ్డి గ్రామస్తులు అప్పన్‌ కందాడై వరదా చార్యులు, దుర్గారెడ్డి, మల్లయ్య, భూమాగౌడ్‌, అంజనేయులు, బాబు, ఎల్లయ్య, రాజేశ్‌, కనకయ్య, శ్రీశైలం, మంకయ్య, కరుణాకర్‌, సదానందరెడ్డి, భైరయ్య, ఐలయ్య, సత్తయ్య పాల్గొన్నారు.

అన్నదాత అరిగోస..!

- మండుతున్న ఎండలు
- అడుగంటిన భూగర్భజలాలు
- ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు

ఎండలు మండుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో సాగునీరందక పంటలు దెబ్బతింటున్నాయి. బోర్ల నుంచి నీరురాక.. పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. చేతికొచ్చిన పంటలు తమ కళ్ల ముందే ఎండిపోతుండటంతో రైతన్న తల్లడిల్లిపోతున్నాడు.


చిన్నశంకరంపేట(మెదక్‌): శాలిపేట గ్రామంలో ఎండిన వరిపంట

3 ఎకరాలలో ఎండిన పంట

చిన్నశంకరంపేట(మెదక్‌): శాలిపేట గ్రామానికి చెందిన మూర్తి యాదగిరి, రాజయ్యల ఆరెకరాలలో వేసిన వరి పంటలో సగం ఎండిపోయింది. బోరులో నీరు తగ్గడంతో మూడు ఎకరాలు ఎండిపోగా, మిగతా పంటను తడులుగా పారపెడుతున్నట్లు రాజయ్య వాపోయాడు.

హత్నూర (సంగారెడ్డి): ఎండిన పంటను చూపిస్తున్న నవీన్‌ గౌడ్‌



పంట పశువుల మేతగా..

హత్నూర (సంగారెడ్డి): కౌలుకు తీసుకున్న 6 ఎకరాలలో వరి పంట సాగు చేస్తే 2 ఎకరాలు పూర్తిగా ఎండిపోయిందని రైతు పాల్వంచ చిన్న శంకరయ్య వాపోయాడు. మరో నాలుగు ఎకరాల వరి పంట ఎండు ముఖం పట్టింది. నీరు రాక బోరు మోటర్‌ కాలిపోయింది. ఎండిన పంటను పశువుల మేత కోసం ఇతరులు కోసుకుపోతున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.


జిన్నారం: జిన్నారంలో ఎండిన వరి పంట

నాటు వేసిన కొద్ది రోజులకే ..

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని ఆయా గ్రామాల్లో నాటు వేసిన కొద్ది రోజులకే బోర్ల నుంచి నీరు రాకపోవడంతో పంటను అలాగే వదిలేశారు. తమను ఆదుకునేలా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అడుగంటిన జలాలు ..

మెదక్‌జోన్‌: జిల్లాలో ఈ ఏడు 2.61లక్షల ఎకరాలలో వరి సాగు చేశారు. 95వేల బోరుబావుల ఆధారంగా వరికి నీటి తడులు అందించారు. ప్రారంభంలో నీరు పుష్కలంగా వచ్చినా క్రమంగా ఎండలు ముదిరే కొద్దీ భూగర్భ జలాలు గణనీయంగా పడిపోతున్నాయి. గతేడాది 2023 ఫిబ్రవరిలో 12.16 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోగా.. ఈ ఏడు ఫిబ్రవరిలో 12.98 మీటర్ల లోతుకు పడిపోయింది. జిల్లాలో గరిష్ఠంగా రామాయంపేట మండలం డి.ధర్మారంలో భూగర్భజల మట్టం 24.79 మీటర్ల లోతుకు పడిపోయింది. అలాగే నార్సింగ్‌ మండలంలో 24.58 మీటర్లు, చిన్నశంకరంపేటలో 22.95 మీటర్లు, రేగోడ్‌ మండలం 21.55 మీటర్లు లోతుకు పడిపోయింది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు.


నర్సాపూర్‌ రూరల్‌: ఎండిన వరి పంటను చూపుతున్న రైతు నేనావత్‌ కిషన్‌ నాయక్‌

40 ఎకరాల వరికి నష్టం

నర్సాపూర్‌ రూరల్‌: మండలంలోని ఎల్లారెడ్డి గూడ తండాకు చెందిన నేనావత్‌ కిషన్‌ నాయక్‌ ఐదేళ్లుగా రెండు ఎకరాల్లో వరి సాగు చేసుకుంటున్నాడు. ఈసారి ఎకరం భూమిలోనే పైసాగు చేయగా బోరుబావి పట్టిపోవడంతో ఆ పంట పూర్తిగా ఎండిపోయింది. ఎల్లారెడ్డిగూడ తండా, జయరామ్‌ తండా, పెద్ద చింతకుంట గ్రామాల్లో సుమారు 40ఎకరాల్లోని వరి పంట ఎండిపోయింది.

పంట చేతికొచ్చే లోపే..


కొడిపల్లి: రాజిపేటలో బక్కుల వెంకట్‌గౌడ్‌

కొడిపల్లి(నర్సాపూర్‌): మండలంలోని రాజిపేట గ్రామానికి చెందిన బక్కుల వెంకట్‌గౌడ్‌ తనకున్న రెండున్నర ఎకరాల పొలంలో వరి సాగుచేశాడు. ఇప్పటివరకు రూ.50 వేల ఖర్చుచేశాడు. పంట చేతి కొస్తుందనేలోపు బోరుబావిలో నీళ్లు అడుగంటి పంట ఎండిపోయింది. అలాగే రాజుగౌడ్‌, గణేశ్‌గౌడ్‌, అలాగే మహ్మద్‌నగర్‌ రైతు బురిగారి కృష్ణ తదితర రైతులకు చెందిన సుమారు 17ఎకరాల వరకు ఎండిపోయినట్లు రైతులు వాపోయారు.

వరకట్న వేధింపులకు పాల్పడి..

- భార్య మృతికి కారణమైన వ్యక్తికి 7ఏళ్ల జైలు
- ఏసీపీ పురుషోత్తంరెడ్డి

ములుగు(గజ్వేల్‌): వరకట్నం వేధింపులకు పాల్పడి తన భార్య మృతికి కారణమైన ఓ వ్యక్తికి 7ఏళ్ల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ గురువారం సిద్దిపేట కోర్టు ప్రధాన న్యాయమూర్తి తీర్పు నిచ్చినట్లు గజ్వేల్‌ ఏసీపీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. ఆయన వెల్లడించిన వివరాల ప్రకారం.. ములుగు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన చింతల మల్లేశ్‌తో రాయపోల్‌ మండలం ఎల్కంటి గ్రామానికి చెందిన మార్కంటి రజిత(24)కు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్నం కింద మల్లేశ్‌కు రెండెకరాల వ్యవసాయ భూమిని ఇచ్చారు. కొంత కాలం తరువాత అదనపు కట్నం కోసం వేదించడం మొదలు పెట్టాడు. దీంతో పెద్దల సమక్షంలో మరో రూ.2లక్షలు మల్లేశ్‌కు అందజేశారు. అనంతరం మోటర్‌సైకిల్‌ కోసం రజితను వేధింపులకు గురిచేశాడు. దీంతో బాధలు భరించలేక ఆమె 2019 ఆగస్టు 8న ఇంట్లో చీరతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. తండ్రి మార్కంటి శంకరయ్య ఫిర్యాదు మేరకు అప్పట్లో ములుగు ఎస్‌ఐ రాజేంద్ర ప్రసాద్‌ కేసు నమోదు చేశారు. అప్పటి గజ్వేల్‌ ఏసీపీ నారాయణ కేసు పరిశోధించి మల్లేశ్‌పై కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేశారు. గురువారం నేరం రుజువైనందున జడ్జి టి.రఘురామ్‌ మల్లేశ్‌కు 7 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

చిరుత దాడిలో హతమైన దూడ

పరిశీలించిన అటవీశాఖ అధికారులు

రామాయంపేట (మెదక్‌): మండలంలోని పర్వతాపూర్‌ పంచాయతీ పరిధిలోని బాయనయ్య తండాలో చిరుత దాడిలో మృతి చెందిన లేగదూడ కళేబరాన్ని గురువారం అటవీశాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుగ్లోత్‌ భీమ్లా నాయక్‌ తన పశువులను పంటచేనువద్ద ఉంచగా, చిరుత దాడిచేసి దూడను హతమార్చింది. తనను ఆదుకోవాలని బాధితరైతు విజ్ఞప్తిచేశారు.

ఆదమరిస్తే అంతే..

దుబ్బాకరూరల్‌: మండలంలోని తిమ్మాపూర్‌, హబ్సిపూర్‌, పోతారెడ్డిపేట గ్రామాల మీదుగా జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. అయితే కాంట్రాక్టర్లు పనులును తమ ఇష్టానుసారం చేస్తున్నారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణం కోసం భారీ గుంతలు తీసి, ఏవిధమైన సూచన బోర్డులు ఏర్పాటు చేయడం లేదని వాపోతున్నారు. రాత్రిళ్లు గోతులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీభత్సం సృష్టించిన దొంగలు

- 5 ఇండ్ల తాళాలు ధ్వంసం
- రెండిళ్లలో బంగారు, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

వర్గల్‌(గజ్వేల్‌): తాళం వేసిన ఇండ్లే టార్గెట్‌గా దొంగలు చెలరేగిపోయారు. వర్గల్‌ మండలం గోవిందాపూర్‌ గ్రామంలోని 5ఇండ్ల తాళాలు ధ్వంసం చేశారు. దొరికినకాడికి నగలు, నగదు అపహరించుకుపోయారు. బుధవారం రాత్రి ఈ చోరీ ఘటనలు జరగగా గురువారం ఉదయం వెలుగులోకి వచ్చాయి. గౌరారం ఎస్‌ఐ శివకుమార్‌, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందాపూర్‌ గ్రామంలోకి బుధవారం గుర్తు తెలియని దొంగలు ప్రవేశించారు. తాళం వేసి ఉన్న లింగ బాలమణి, కీసరి రామవ్వ, బుజి లింగం, యావపురం రవి, బుడిగె యాదగిరికి చెందిన ఇండ్ల తాళాలు పగులగొట్టారు. ఆయా ఇండ్లలో బీరువాల నుంచి వస్త్రాలు, ఇతల వస్తువులను తీసి చిందరవందరగా పడేశారు. లింగ బాలమణి తాను ఉండే పాత ఇంటికి తాళంవేసి రాత్రి కొడుకు ఇంటికి వెళ్లింది. దొంగలు ఆ తాళం ధ్వంసంచేసి ఇంట్లో బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు, 90 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదు అపహరించారు. అదేవిధంగా కేసరి రాములమ్మ ఇంటిలో తులం బంగారు, 28 తులాల వెండి ఆభరణాలు, కొంత నగదు చోరీచేశారు. మిగతా మూడు ఇండ్లలో తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించినప్పటికి వారికి ఏమీదొరకలేదు.


చిందరవందరగా పడిఉన్న దుస్తులు

గౌరారం ఎస్‌ఐ శివకుమార్‌ ఆయా ఇండ్లను పరిశీలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఊళ్లకు వెళ్లేవారు సమీప పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బాలస్వామి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి

- కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల్లో ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు
- ఆర్టీసీ బస్టాండ్‌లే వారి టార్గెట్‌
- 12.5తులాల బంగారు ఆభరణాలు, 6 సెల్‌ఫోన్లు, కారు స్వాధీనం
- ఎస్పీ బాలస్వామి

తూప్రాన్‌ : ఆర్టీసీ బస్టాండ్‌లలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ బాలస్వామి తెలిపారు. గురువారం డీఎస్పీ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ఫిబ్రవరి 27న పట్టణానికి చెందిన ఉప్పల శ్వేత హైదరాబాద్‌కు వెళ్లేందుకు బస్సు ఎక్కుతున్న క్రమంలో ముగ్గురు మహిళలు ఆమె హ్యాండ్‌బ్యాగ్‌లోని 12.5తులాల బంగారు ఆభరణాలు అపహరించి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామన్నారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం నిందితులను ఓ దాబాహోటల్‌ వద్ద అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. పలు నేరాలలకు పాల్పడినట్లు తమ విచారణలో నిందితులు అంగీకరించినట్లు తెలిపా రు. మహారాష్ట్రకు చెందిన విషాలి విజయ్‌ సోలంకి, హిన కరణ్‌ రాహదే, జయశ్రీ అంకుశ్‌ సోలంకి, విజయ్‌బీమ్రసోలంకిచ కరణ్‌ సంతోష్‌ రాహెదే అనే ఐదుగురు ముఠాగా ఏర్పడి పలు దొంగతనాలకు పాల్పడుతున్నట్టు వివరించారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట, ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమల-1 టౌన్‌, హైదరాబాద్‌లోని షాద్‌నగర్‌తో పాటు మహారాష్ట్రలో పలుచోట్ల దొంగతనాలకు పాల్పడి జైలుకు వెళ్లివచ్చినట్లు ఎస్పీ బాలస్వామి చెప్పారు.

ఆభరణాలు రికవరీ

తూప్రాన్‌ బస్టాండ్‌లో ప్రయాణికురాలు ఉప్పల శ్వేత బ్యాగు నుంచి కాజేసిన 12.5 తులాల బంగారు ఆభరణాలు, ఆరు సెల్‌ఫోన్లు, ఒక కారును నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కృష్ణ, ఎస్‌ఐ శివనందంలను ఎస్పీ అభినందించారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి

– సీపీ అనురాధ


రికార్డులు పరిశీలిస్తున్న సీపీ అనురాధ

చేర్యాల(సిద్దిపేట): రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు సమన్వయంతో విధులు నిర్వహించాలని సీపీ అనురాధ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌ను ఆమె సందర్శించారు. అధికారులు, సిబ్బందికి పలు విధులు, విధానాలపై అవగాహన కల్పించారు. స్టేషన్‌ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాల గురించి అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల కేసుల వివరాలపై ఆరాతీశారు. అలాగే పలు రికార్డులు, పెండింగ్‌లో ఉన్న సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. ప్రతి రెండు, మూడు రోజులకు ఒకసారి గ్రామాలను సందర్శించి సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. గంజాయి, మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు చోటు చేసుకోకుండా ప్రత్యేక సమాచార వ్యవస్థను రూపొందించుకోవాలని సూచించారు. సంబంధిత అధికారులతో కలిసి ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఆమె వెంట ఏసీపీ సతీశ్‌, సీఐ శ్రీను, ఎస్‌ఐ దామోదర్‌ తదితరులు ఉన్నారు.

జీవవైవిధ్యం సంరక్షణ


ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్‌ కళాశాల

సిద్దిపేటఎడ్యుకేషన్‌: జీవవైవిధ్య సంరక్షణపై రెండు రోజులపాటు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్‌ కళాశాలలో బాటనీ విభాగాధిపతి, సదస్సు కన్వీనర్‌ డాక్టర్‌ కొమ్మిడి రాణి ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి సదస్సు గురువారంతో ముగిసింది. ఈ సదస్సులో విద్యార్థులు, పరిశోధకులు, సైంటిస్టులు, ఆయా యూనివర్సిటీల బోర్డ్‌ ఆఫ్‌ స్టడీస్‌ చైర్మన్లు, విభాగాధిపతులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు. సదస్సు నిర్వహణ, సమర్పించిన పత్రాలు, వివరించిన అంశాలపై పలువురు విద్యార్థినులు తమ అభిప్రాయాలు తెలిపారు. వారు చేసిన పరిశోధనల గురించి వారి మాటల్లోనే..

చెరువు నీటిపై పరిశోధన



మా ప్రాజెక్టు వర్క్‌ లో భాగంగా సిద్దిపేట పరిసర ప్రాంతాల్లోని పలు చెరువుల నీటిపై పరిశోధన చేశాం. నీటి నమూనాలను సేకరించి వాటిని పరిశీలించగా కప్పలకుంట చెరువులో నీరు అధికంగా కాలుష్యమైందని తేలింది. అందుకు గల కారణాలు, వాటితో వచ్చే అనర్థాలు, తద్వారా జీవవైవిధ్యానికి జరిగే నష్టాన్ని గురించి సదస్సులో వివరించే అవకాశం కలిగింది.

– అఫ్రోజ్‌, ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం, పీజీ కళాశాల సిద్దిపేట

వ్యవసాయానికి అనుకూలం



సిద్దిపేట కోమటి చెరువు, పెద్ద చెరువు, ఎర్ర చెరువు, గజ్వేల్‌ పాండవుల చెరువుల నీటి నమూనాలను సేకరించాం. ఆ నీటి నమూనాలను ల్యాబ్‌లో పరిశోధించాం. ఈ చెరువుల నీటిలో కాలుష్యం అంతగా లేదని నిర్ధారించుకున్నాం. అందుకనే ఈ చెరువుల నీళ్లు వ్యవసాయానికి అనుకూలంగా ఉంటాయనే అంశాన్ని వివరించాం.

– కావ్యశ్రీ, ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం, పీజీ కళాశాల, సిద్దిపేట

జంతు జాలానికి నష్టం



మా ప్రాజెక్టులో భాగంగా చెరువుల నీటిపై పరిశోధన జరిపాం. కలుషితమైన నీరు మూలంగా చెరువుల్లో జంతుజాలానికి జరిగే నష్టంతోపాటు పశువులు, చేపలకు వచ్చే వ్యాధులు, తద్వారా జీవవైవిధ్యానికి ఎలా విఘాతం కలుగుతుందనే అంశాలను వివరించాను.

– సంధ్యారాణి, ఎమ్మెస్సీ ద్వితీయ సంవత్సరం, పీజీ కళాశాల, సిద్దిపేట


నూతన ఆవిష్కరణలు తెలుసుకున్నా



తడి నేలలు, నీటి ఆవాసాల్లో విస్తారంగా పెరిగే కలుపు మొక్కల విస్తరణ స్థాయిని తెలుసుకునే విషయాలపై సదస్సులో వివరించాను. పరిశోధన అభిరుచులు, నూతన ఆవిష్కరణలను తెలుసుకునే అవకాశం కలిగింది.

– రంషిద, ఎమ్మెస్సీ ఎన్విరాన్మెంటల్‌ సైన్స్‌, కేరళ యూనివర్సిటీ

అగ్ని ప్రమాదాల పై...



అడవిలో కార్చిచ్చులు ఎలా వ్యాపిస్తాయి. వాటి ద్వారా జీవవైవిద్యానికి జరిగే నష్టం గురించి సదస్సులో వివరించే అవకాశం కలిగింది. 33 జిల్లాల్లో అడవుల్లో జరిగే అగ్ని ప్రమాదాలపై పరిశోధించాను. భద్రాద్రి కొత్తగూడెంలో అధిక అగ్ని ప్రమాదాలు జరుగుతుండగా.. రంగారెడ్డిలో తక్కువగా ఉన్నాయి.

– శిజిల, ఎమ్మెస్సీ ఎన్విరాన్మెంటల్‌ సైన్స్‌, కేరళ యూనివర్సిటీ